క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ఐఏఎస్ అధికారి యువరాజ్



యువరాజ్‌కు అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ప్రభుత్వ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ సెక్రటరీ ఎన్.యువరాజ్ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలోని స్వామికి అర్చకులు అష్టోత్తర పూజ నిర్వహించారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఈవో అందజేశారు. ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్ రాజ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

వైభవంగా నిత్య కల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



06జీపిఎల్61: వేపగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: నిరంతరం ధ్యాన సాధన చేయడం వల్ల విద్యార్థుల మేధస్సు పదును పెరిగి చదువులో చురుగ్గా ఉంటారని పాపయ్యరాజుపాలెం పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రతినిధి లక్ష్మి అన్నారు. కేంద్రం ఆధ్వర్యంలో వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పురుషోత్తపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ధ్యానం ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతి రోజూ నిర్దిష్ట సమయంలో ధ్యానం చేయాలని సూచించారు. విద్యార్థులు సామూహిక ఆసనాలు వేశారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్ర ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు ఆరు వినతులు

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వివిధ సమస్యలపై ఆరు వినతులు వచ్చాయి. జోన్ పరిధిలో పలు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు. పలు చోట్ల కాలువల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంతాల వాసులు విన్నవించారు. జోన్–8 పరిధిలోని అన్ని విభాగాల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు



సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

పరవాడ: అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధుల సూచనలను అధికారులు పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

పనులపై సమీక్ష ఇలా

- తిక్కవానిపాలెం జగనన్న లేఅవుట్‌లో శాశ్వత మంచి నీటి పథకం నిర్మాణానికి ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసిందని టెండర్లు కూడా పిలిచామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షన్ముఖ చెప్పారు.
- కన్నూరులో సీసీ కాలువల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు కాగా రూ.15 లక్షల మేర పనులు పూర్తి చేశామని.. రూ.15లక్షలతో వెన్నలపాలెంలో డ్రైన్లు నిర్మించామన్నారు. అలాగే భర్నికం, గొర్లివానిపాలెం గ్రామాల్లో కాలువల నిర్మాణం పనులు పూర్తి చేశామని ఏఈ చెప్పారు.
- మండలంలోని గ్రామ సచివాలయ, ఆర్‌బీకే భవనాలపనులు చురుగ్గా సాగుతున్నాయని పంచాయతీరాజ్ జేఈ జి.రామారావు చెప్పారు.
- వర్షాలు లేక సకాలంలో రబీ సీజన్ ప్రారంభం కాలేదని మండల వ్యవసాయాధికారి సీహెచ్. చంద్రావతి చెప్పారు. రైతు భరో పథకంలో మండలంలో 2,314 మంది లబ్ధి పొందుతారని చెప్పారు.
- రావాడలో అటవీశాఖ, జిరాయితీ భూములకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించడానికి జాయింట్ సర్వే నిర్వహించాలని సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు పి.కనకారావు హామీ ఇచ్చారు.
- కోర్టు వివాదాల కారణంగా మండలంలో 6 లేఅవుట్లు పెండింగ్‌లో ఉన్నాయని తహసీల్దారు చెప్పారు.
- రావాడలో ప్రభుత్వ స్థలం లేని కారణంగా లేఅవుట్ వేయడంలో జాప్యం జరుగుతుందని చెప్పారు.

చురగ్గా గృహ నిర్మాణాలు

మండలంలోని 8 జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని గృహ నిర్మాణశాఖ ఏఈ ఎం.ఎస్.ఎన్.రెడ్డి చెప్పారు. తొలి విడతగా మండలంలో 450 జగనన్న ఇళ్లు పూర్తి చేశామని.. మిగిలిన ఇళ్లను త్వరతగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకొంటున్నామని ఏఈ చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, వైఎస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా



శిబిరాన్ని ప్రారంభిస్తున్న 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాచలం: ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని 93వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు అన్నారు. 526 సచివాలయం పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలకు స్పెషలిస్టు వైద్యులు వైద్య సేవలు అందించారు. మందులు ఉచితంగా అందజేశారు. శ్రీనివాస నగర్‌లోని మనసు అనాథ ఆశ్రమానికి చెందిన పలువురు బాలికలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

502 మందికి వైద్య పరీక్షలు : జీవీఎంసీ 98వ వార్డులో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు ప్రారంభించారు. సుమారు 502 మందికి స్పెషలిస్టు వైద్యులు వైద్య సేవలు అందించారు.మందులు ఉచితంగా అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి సత్తిబాబు, తెడ్లపు మహేష్, ఆర్‌పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న దాసరి సత్తిబాబు

రోజుకో గుడ్డుతో సంపూర్ణ ఆరోగ్యం



నెక్ వ్యవస్థాపక అధ్యక్షుడు రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామారావు తదతరులు

సబ్బవరం: ప్రతి ఒక్కరూ రోజుకో కోడిగుడ్డు తీసుకోవడం వల్ల తగిన పౌష్టికాహారం అందడంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నెక్(నేషనల్ ఎగ్ కార్పొరేషన్) జాతీయ కార్యవర్గ సభ్యుడు భరణికాన రామారావు అన్నారు. నెక్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీవీ రావు జయంతి పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ రెండు గుడ్లు చొప్పున పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయులంతా తీసుకునే ఆహారంలో అత్యంత పోషక విలువుల ఉన్నది కోడిగుడ్డులో మాత్రమేనని తెలిపారు. ప్రొటీన్ల లోపాన్ని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ గుడ్లు తీసుకోవాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ గుడ్లు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు,నెక్ చైర్మన్ భాస్కర్, శేషగిరిరావు, భరణికాన బాబూరావు,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని వినతి



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న కాలనీల వాసులు

పెందుర్తి: పెందుర్తి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని కోరుతూ పెందుర్తి రాయల్ కేసీఆర్ అపార్ట్‌మెంట్ వాసులు, స్థానికులు సోమవారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతికి వినతి పత్రం సమర్పించారు. ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించి ఈ స్టేషన్‌లో హాల్ట్ మంజూరు చేసేలా రైల్వే శాఖకు సిఫార్సు చేయాలని కోరారు. రైల్వే శాఖ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దాడి రమణచిట్టి, 97వ వార్డు అధ్యక్షుడు దాడి ఉమామహేశ్వరరావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీలపై చర్యలు చేపట్టాలి



అక్రమ క్వారీ స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ పి.ఎస్.రాజు తదితరులు

పరవాడ: ఈ.బోనంగి, దేశపాత్రునిపాలెం రెవెన్యూ పరిధిలో అక్రమ క్వారీలపై గనులు భూగర్భ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు అక్రమ క్వారీలపై ధ్వజమెత్తారు. దీంతో జెడ్పీటీసీ పి.ఎస్.రాజు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి అక్రమ గ్రావెల్ క్వారీలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు ప్రాంతాల్లో గ్రావెల్ క్వారీలకు అనుమతులు లేవన్నారు. అక్రమార్కులు రాత్రి వేళ భారీ యంత్రాలతో విలువైన గ్రావెల్ తరలించి కోట్లాది రూపాయిలు కొల్లగొడుతున్నారన్నారు. ఈ.బోనంగి సమీపాన ఇండస్ట్రియల్ పార్కును ఆనుకుని ఉన్న స్థలంలో రాత్రి వేళ గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారన్నారు. ఈ తవ్వకాలపై విజిలెన్స్, గనులు భూగర్భ, రెవెన్యూ శాఖల అధికారులు నిఘా ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ గ్రావెల్ దందాపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు జెడ్పీటీసీ పి.ఎస్.రాజు చెప్పారు. అక్రమ గ్రావెల్ క్వారీని సందర్శించిన వారిలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, కన్నూరు ఎంపీటీసీ గొల్లవెల్లి శ్రీనివాసరావు, పరవాడ, గొర్లివానిపాలెం సర్పంచులు సిరపరపు అప్పలనాయుడు, గొర్లి గోపి అమ్మలు ఉన్నారు.

అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అవినీతి రహిత సమాజ స్థాపన అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ,చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ స్థాపనలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం అరికట్టాలని నిరసన

పరవాడ: పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తానాంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ రాంకీ యాజమాన్యం విడుదల చేస్తున్న రసాయన వ్యర్థాలతో పర్యావరణం, చెరువులు కలుషితమవుతున్నాయన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించి పర్యావరణాన్ని కాపాడడానికి చర్యలు చేపట్టాలని గనిశెట్టి కోరారు. కార్యక్రమంలో వర్రి సన్యాసిరావు, రొంగలి అప్పారావు,ఎం.అప్పలనాయుడు, భవాని, అచ్చమ్మ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



సమావేశంలో పాల్గొన్న అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బి.సూర్యకళ వెల్లడించారు. వారం రోజుల పాటు వివిధ రకాల పోటీలు, పుస్తక ప్రదర్శన, కవి సమ్మేళం, గ్రంథాలయ ఉద్యమకారుల గురించి చర్చా కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. సోమవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో వారోత్సవాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20 విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు పెతకంశెట్టి భూలోకరావు, కార్యదర్శి ఆడారి రామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు దాసరి సత్యం, శ్యాంసుందర్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల కోసం స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్ – కటక్ – హైదరాబాద్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- హైదరాబాద్–కటక్ (07165) స్పెషల్ హైదరాబాద్‌లో ఈ నెల 7, 14, 21న (ప్రతీ మంగళవారం) రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.07 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కటక్ – హైదరాబాద్ (07166) స్పెషల్ కటక్‌లో ఈ నెల 8, 15, 22న (ప్రతీ బుధవారం) రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 7.37 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.
- ప్రయాణికుల సౌకర్యార్థం పూర్తి జనరల్ కోచ్‌లతో కూడిన ఎర్నాకుళం ధన్‌బాద్ (06077) స్పెషల్ రైలు ఈ నెల 10న రాత్రి 11.55 గంటలకు ఎర్నాకుళంలో బయల్దేరి ఆదివారం తెల్లవారుజామున 1.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.50 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ రైలు 22 జనరల్, 2 లగేజీ కం సెకండ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తుంది.
- ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు–న్యూ భువనేశ్వర్–బెంగళూరు మధ్య జన సాధారణ్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.
- బెంగళూర్ – న్యూ భువనేశ్వర్ (06287) స్పెషల్ ఈ నెల 10న బెంగళూరులో తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 10.38 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 10.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు న్యూ భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో న్యూ భువనేశ్వర్ – బెంగళూరు (06288) స్పెషల్ శనివారం ఉదయం 8.15 గంటలకు న్యూ భువనేశ్వర్‌లో బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.15 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 4.17 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

రైళ్లలో పేలుడు పదార్థాల రవాణా నేరం

ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకువెళ్లరాదని, ఇది ప్రమాదకరమని, శిక్షార్హమైన నేరమని వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టపాసులు, గ్యాస్ సిలిండర్స్, ఏసిడ్, కిరోసిన్, పెట్రోల్ వంటి వాటిని రైళ్లలో, రైల్వే స్టేషన్లలోనికి తీసుకురావడం రైల్వే యాక్ట్ 1998 ప్రకారం నేరమని, ఇలా చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. దీపావళి సమీపిస్తున్న తరుణంలో వాల్తేర్ డివిజన్ వీటికి సంబంధించి ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరితోపాటు సివిల్ డిఫెన్స్ సభ్యులు, టీటీఈలు, కోచ్ అటెండెంట్స్, ట్రైన్ మేనేజర్స్, స్టేషన్ మేనేజర్లు కూడా తరచూ తనిఖీలు చేపడతారన్నారు. ప్రయాణికుల సహాయం కోసం 139 నంబర్‌ను సంప్రదించాలని త్రిపాఠి కోరారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

గోపాలపట్నం: ఆసవానిపాలెంలో ఆదివారం రాత్రి జరిగిన గొడవలో ఆలమూరి కరుణ్ కుమార్ మృతికి కారణమైన నలుగురిని సోమవారం ఎయిర్‌పోర్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ వేగవంతం చేశారు. వీరిని మంగళవారం రిమాండ్‌కు పంపిచే అవకాశముందని సమాచారం.

ఆంగ్లంలో పట్టు సాధించడం తప్పనిసరి

మద్దిలపాలెం : ఆంగ్లంలో పట్టు సాధించడం నేటి తరానికి ఎంతో అవసరమని, అందరూ ఆంగ్లంలో రాణించడానికి కృషి చేయాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో సోమవారం వృత్తిలోను, జీవితంలో ఆంగ్ల భాషా నైపుణ్యానికి పట్టు అవసరం అనే అంశంపై ఆరు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనికేషన్‌కు ఆంగ్లం ఎంతో కీలకమన్నారు. ఆంగ్లంపై పట్టుకు వర్క్‌షాప్ ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం ఆంగ్ల విభాగాధిపతి రావి రాణి, పి.పద్మప్రియ, ఎస్.వి.రామారావు, సి.వి.ఎస్.రవీంద్రనాథ్, టి.రామకృష్ణ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, సంస్కృత విభాగాధిపతి పోలా ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మి, కుసుమ కుమారి పాల్గొన్నారు.

యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన



జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన గురుకుల పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

పరవాడ: కోల్‌కతా వేదికగా డిసెంబర్‌లో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు తానాం గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఎస్జీపీసీ యోగా శిక్షణ కోచ్ సీహెచ్.ఆంజనేయులు చెప్పారు. ఈ నెల 1, 2, 3 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం వీరవాసంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపిన ఎం.తేజస్విని, కె.హరిత, కె.ధనలక్ష్మి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈమేరకు పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు, అసిస్టెంటు ప్రిన్సిపాల్ పద్మ, లలిత తదితరులు విద్యార్థులను అభినందించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ అశోక్ కుమార్

గోపాలపట్నం: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గోపాలపట్నం సీఐ అశోక్ కుమార్ సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గోపాలపట్నం రైతు బజారు వద్ద ఉన్న ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై సీఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోలను ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపై నిలిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. బస్ స్టాపుల వద్ద నిలపరాదని సూచించారు. ఆటోలకు ఇన్సూరెన్స్, డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫాం ధరించాలని తెలిపారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఆటో డ్రైవర్లు క్రమశిక్షణగా వ్యవహరించక పోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. స్కూల్ సమయాల్లో మరింత ఇబ్బందికరంగా ఉంటోందన్నారు. ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమం నుంచి కుటుంబీకుల చెంతకు



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మమత

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం వారి కుటుంబీల చెంతకు చేర్చారు. కొన్ని రోజుల కిందట కేజీహెచ్‌లో చికిత్స కోసం చేరిన వారి తీసుకెళ్లేందుకు ఎవరూ రాక పోవడంతో వారికి మమత చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు ఎల్లేటి మమత ఆశ్రయం కల్పించారు. వీరిలో ఒకరు ఒడిశాకు చెందిన అజిత్ కాగా బిహార్‌కు చెందిన ఉమేష్ ఉన్నారు. వారి కుటుంబ సభ్యులకు వివరాలు తెలుసుకున్నారు. ఎట్టకేలకు మూడు నెలల తర్వాత వారిద్దరినీ కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేసి, జీవీఎంసీ నిరాశ్రయుల కేంద్రం మేనేజర్ మమతకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐఎన్ఎస్ ఢిల్లీని సందర్శించిన విద్యార్థులు



విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ ఢిల్లీ వద్ద విద్యార్థులు

సింధియా: ఇండియన్ నేవీ ఔట్రీచ్ కార్యకలాపాల్లో భాగంగా న్యూఢిల్లీలోని అమృత విద్యాలయం నుంచి 120 మందికి పైగా విద్యార్థులు విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ ఢిల్లీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నావికాదళ సిబ్బంది పలు నౌకల పనితీరుతో పాటు వాటి సామర్థ్యాలను, దేశ భద్రతలో ఇండియన్ నేవీ బహుముఖ పాత్ర గురించి వివరించారు.

రూ.1.25 కోట్ల ఆస్తి పన్ను వసూలు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ విభాగం అధికారులు సోమవారం రూ.1,25,57,825 ఆస్తి పన్ను వసూలు చేశారు. 69వ వార్డులోని ఈఎస్ఐ ఆస్పత్రి చెల్లించాల్సిన మూడేళ్ల పన్నును అధికారులు ఒకేసారి వసూలు చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్ఐలు సుభాన్, మోహన్, శివ జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని జెడ్సీ అభినందించారు.